AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
17-9-2025 (Wednesday)
MAIN EDITION

## డిగ్రీతో ఆర్‌బీఐలో కొలువులు..




**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గూడ్ న్యూస్ చెప్పింది. గ్రేడ్ బీ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 120 పోస్టులు భర్తీ చేయనుంది. ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబర్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ https://www.rbi.org.inలో సంప్రదించవచ్చు.

## ప్రధానికి శుభాకాంక్షల వెల్లువ..



**అక్షరటుడే, వెబ్‌డెస్క్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. 75వ పుట్టినరోజు సందర్భంగా ప్రపంచ నేతలంతా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధాని నేతన్యాహు, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్, భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే, మారిషస్ ప్రధాని రామ్‌గూడలం సహా ప్రపంచ నాయకులందరూ మోదీని విష్ చేశారు.

## అదరగొట్టిన అర్బన్ కంపెనీ




**అక్షరటుడే, వెబ్‌డెస్క్ :** 'అర్బన్ కంపెనీ' అదరగొట్టింది. తొలిరోజే ఇన్వెస్టర్లకు లాభాల పంట పడించింది. ఇటీవలే ఐపీవోకు వచ్చిన అర్బన్ కంపెనీకి భారీ ఆదరణ లభించింది. సెప్టెంబర్ 10 నుంచి 12 మధ్య బిడ్లను ఆహ్వానించగా, 103.63 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారుల ఆసక్తిని ఆకర్షించిన అర్బన్ కంపెనీ మార్కెట్‌లోకి ఘనంగా ఎంట్రీ ఇచ్చింది. బుధవారం భారీ లాభాలతో స్టాక్ మార్కెట్‌లోకి అరంగేట్రం చేసింది. ఐపీవో ధర కంటే 57 శాతం కంటే ఎక్కువ ప్రీమియంతో లిస్టింగ్ అయ్యాయి. ఎన్ఎస్ఈలో ఒక్కో షేరుకు రూ.162.25 వద్ద, బీఎస్ఈలో షేర్లు ఒక్కొక్కటి రూ.161 వద్ద లిస్ట్ అయింది. షేర్ల లిస్టింగ్ తర్వాత కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 23,118.02 కోట్లుగా నమోదైంది.

## పార్టీ టికెట్ నాకే ఇవ్వాలి



**అక్షరటుడే, హైదరాబాద్ :** అధికార కాంగ్రెస్‌లో జూబ్లీహిల్స్ టికెట్ కోసం పోటీ పెరుగుతోంది. టికెట్ కోసం పలువురు ప్రయత్నాలు ప్రారంభించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ స్థానం నుంచి గెలిచిన మాగంటి గోపినాథ్ జూన్ 8న మృతి చెందారు. దీంతో త్వరలో ఆ స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. అయితే అధికార పార్టీలో ఆ టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఆ స్థానం నుంచి తాను పోటీ చేస్తానని తాజాగా మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. గతంలో మాజీ ఎంపీ అజారుద్దీన్ ఈ టికెట్ ఆశించగా.. ఆయన ఎమ్మెల్సీ అయ్యారు. దీంతో యాదవ సామాజిక తరఫున తనకే టికెట్ ఇవ్వాలని అంజన్ కుమార్ కోరారు. పార్టీలో తెర వెనుక ఏం జరుగుతుందో తెలియదని అన్నారు. తనకంటే సీనియర్లు ఎవరూ లేరని వ్యాఖ్యానించారు. అధిష్టానం తనకే టికెట్ ఇస్తుందని ఆశిస్తున్నానన్నారు. ఉప ఎన్నికల్లో తాను పోటీ చేయాలని ప్రజలు కోరుకుంటున్నట్లు చెప్పారు.

“

హైదరాబాద్ నగరం డ్రగ్స్‌కు గేట్‌వేగా మారింది. డ్రగ్స్, గంజాయి నియంత్రణ కోసం ఈగల్ టీమ్ ఏర్పాటు చేశాం. వీటి కట్టడి కోసం కఠినంగా వ్యవహరిస్తాం. మత్తు పదార్థాలను అరికట్టడానికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కొందరికి నచ్చకపోవచ్చు. డ్రగ్స్, గంజాయి దందాలో ఎంత పెద్ద వాళ్లు ఉన్నా కనికరించేది లేదు. ఫాంహౌస్‌లలో గంజాయి పండించి సరఫరా చేస్తే ఊరుకోబోం. ప్రజల సహకారంతో మత్తు మాఫియాను రాష్ట్రం నుంచి తరిమేస్తాం.

—ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# డ్రగ్స్ దందాపై ఉక్కుపాదం



- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన
- ప్రజపాలన దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

**అక్షరటుడే, హైదరాబాద్ :** ప్రపంచ ఉద్యమాల చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటం గొప్పదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. అంతుముందుకు గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ చరిత్రకు శ్రీకారం చుట్టిన శుభదినం సెప్టెంబర్ 17 అని అన్నారు. బానిసత్వ సంకెళ్లను తెంచడానికి అమరులైన వారికి నివాళులర్పిస్తున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ ప్రభుత్వం పాలన సాగిస్తుందని తెలిపారు.

### 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ

శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని సీఎం తెలిపారు. త్వరలోనే ఆ పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు. 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డుకు అనుగుణంగా రీజినల్ రింగ్ రైల్ కోసం కేంద్రం దాదాపుగా అంగీకరించిందన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా చెన్నై బుల్లెట్ ట్రెయిన్ కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. రూ.24 వేల కోట్లతో మెట్రో రెండవ దశ విస్తరణ ప్రాజెక్టును చేపడుతున్నట్లు వెల్లడించారు. కృష్ణా, గోదావరి నదులు తెలంగాణ జీవనాడులు అని సీఎం పేర్కొన్నారు. ఆ నదుల్లో మనకు హక్కుగా దక్కాల్సిన నీటి వాటాలపై రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. ప్రతి చుక్క నీటిపై పక్కా హక్కులు సాధించే దిశగా కృష్ణా జలాల విషయంలో న్యాయ పోరాటానికి సిద్ధమైనట్లు వెల్లడించారు.

### మూసీని సుందరంగా మారుస్తాం

మూసీ నదిని శుద్ధి చేసి హైదరాబాద్‌ను సుందరంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మూసీ చుట్టూ బతుకుతున్న ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతామన్నారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా మూసీ నదిని మారుస్తామని తెలిపారు. తెలంగాణ ఖ్యాతి దెబ్బతీస్తున్న డ్రగ్స్ మహమ్మారిని పాలదోలేందుకు ఈగల్ టీం అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. డ్రగ్స్ మాఫియాను తరమి కొడతామని సీఎం పునరుద్ఘాటించారు.

## 'స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్' కార్యక్రమానికి శ్రీకారం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** స్త్రీలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుందన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వారికి అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయాలన్న లక్ష్యంతో 'స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్' అభియాన్ కార్యక్రమాన్ని రూపొందించింది. బుధవారం ప్రారంభమైన ఈ కార్యక్రమం వచ్చేనెల 2వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇందులో భాగంగా గ్రామ స్థాయినుంచి నగరాల వరకు అన్ని చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మహిళలకు అవసరమైన వైద్య పరీక్షలు చేస్తారు. వైద్య పరీక్షలు చేసి రోగ నిర్ధారణ అయితే వెంటనే తగిన చికిత్స, మందులు అందించడం కోసం 'స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్' కార్యక్రమాన్ని తీసుకువచ్చారు. తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పల్లె దవాఖానాల నుంచి జిల్లా హాస్పిటల్స్‌తో పాటు బోధనాస్పత్రుల పరిధిలోనూ ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

## యువత తలుచుకుంటే ప్రభుత్వాలు కూలిపోతాయి..



**అక్షరటుడే, హైదరాబాద్ :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి రాష్ట్ర ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 'యువత అనుకుంటే ఏదైనా సాధ్యం అని.. ప్రభుత్వాలు సైతం కూలిపోతాయని' హెచ్చరించారు. ఇటీవల నేపాల్‌లో అవినీతి ప్రభుత్వాన్ని దింపడానికి యువత చేసిన పోరాటాన్ని ప్రపంచం మొత్తం చూసిందన్నారు. నిరుద్యోగులతో పెట్టుకున్న ప్రభుత్వం మనుగడ సాధించలేదని చెప్పారు. ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మాట ఇచ్చిందని రాజగోపాల్‌రెడ్డి గుర్తు చేశారు. దీంతో నిరుద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని ఆయన చెప్పారు. అయితే ప్రభుత్వం 50 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందన్నారు. మిగతా ఉద్యోగాలను సైతం భర్తీ చేయాలని యువత డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. నిరుద్యోగులకు తాను అండగా ఉంటానన్నారు. యువత ఆశయాల కోసం వారితో ఉంటానని హామీ ఇచ్చారు. నిరుద్యోగులకు దారి చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## ప్రపంచాన్ని శాసించే స్థాయికి భారత్..



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** భారత్ అంటే సాదాసీదా దేశం కాదని, ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో మన సైనిక సత్తాను ప్రపంచానికి చూపించామన్నారు. ఆపరేషన్ సిందూర్ ఆగిపోలేదని, తాత్కాలిక విరమణ మాత్రమే ఇచ్చామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం కేంద్ర బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ అమర వీరులకు నివాళులర్పించిన అనంతరం రాజ్‌నాథ్ ప్రసంగించారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ధర్మం ప్రకారమే నడుస్తామని చెప్పారు. జాతీయ ప్రయోజనాలు, సమైక్యతను దెబ్బతీసే కుట్రలను తిప్పికొడతామన్నారు. పటేల్ కలలు గన్న దేశాన్ని నిర్మించేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని, ప్రపంచంలో అగ్ర దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇవాళ భారత్ అంటే సాదాసీదా దేశం కాదని, ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదుగుతోందన్నారు. మనలో ఎన్ని విభేదాలున్నా దేశం విషయానికి వచ్చేసరికి అంతా ఒక్కటేనని పునరుద్ఘాటించారు.


## బీజేపీ, కాంగ్రెస్‌పై కవిత విమర్శలు..



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** తెలంగాణ సాయుధ పోరాటమంటే మతపరమైనదికాదని తెలంగాణ జాగృతి వ్యవస్థాకురాలు కవిత అన్నారు. జమీందార్లు, జాగిర్దార్లకు జరిగిన వ్యతిరేక పోరాటమని, కాంగ్రెస్, బీజేపీ చరిత్ర వక్రీకరిస్తున్నాయని మండిపడ్డారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విలీన దినోత్సవంగా హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. జెండా ఆవిష్కరించిన అనంతరం నాడు సాయుధ పోరాటంలో పాల్గొన్న పలువురిని సన్మానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. నాటి పాలకులు చేస్తున్న ఆగడాలు, అరాచకాలకు తిరిగి తెలంగాణ ప్రజలు ఏకతాటిపైకి వచ్చి తిరగబడ్డారన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రైతులు, ప్రజలు.. దొరలకు వ్యతిరేకంగా ఎదురు తిరిగారని గుర్తు చేశారు. 1942లో జరిగిన సాయుధ తెలంగాణ పోరాటంపై విదేశాల్లో పాఠాలుగా చెప్పుకుంటున్నారన్నారు. ఆ పోరాట పటిమతోనే తెలంగాణను సాధించుకున్నామని చెప్పారు. అరాచక పాలన ఎవరు చేసినా ప్రజలు ఊరుకోరని తెలంగాణలో జరిగిన ఉద్యమాలే నిదర్శనమని కవిత అన్నారు.

## రికార్డు స్థాయిలో రష్యా చమురు దిగుమతి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** చౌకగా లభిస్తున్న రష్యా చమురును భారత్ సద్వినియోగం చేసుకుంటోంది. తక్కువ ధరకే లభిస్తుండడంతో మాస్కో నుంచి భారీగా దిగుమతి చేసుకుంటోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దని అమెరికా ఎన్ని ఒత్తిళ్లు తెస్తున్నా ఇండియా మాత్రం వెనుకడుగు వేయడం లేదు. గతంలో కంటే ప్రస్తుత నెలలో భారీగా దిగుమతి చేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలతో పాటు ఇతర అమెరికన్ అధికారుల నిరంతర దాడులు భారత శుద్ధి కర్మాగారాలు రష్యా నుంచి కొనుగోళ్లు చేయాలనే నిర్ణయంపై ఎలాంటి ప్రభావం చూపలేదని డెలివరీలు సూచిస్తున్నాయి. సెప్టెంబర్ నెలలో అంటే గత 16 రోజుల్లో ఇండియా రోజుకు 1.73 మిలియన్ బ్యారెళ్ల రష్యన్ చమురును దిగుమతి చేసుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. జూలై, ఆగస్టులో దిగుమతి వాల్యూమ్‌లు వరుసగా రోజుకు 1.59 మిలియన్ బ్యారెళ్లు, 1.66 మిలియన్ బ్యారెళ్లుగా నమోదయ్యాయి. కానీ ఈ సెప్టెంబర్ మాసంలో మాత్రం రికార్డు స్థాయిలో రోజుకు 1.73 మిలియన్ బ్యారెళ్లు దిగుమతి అవుతున్నాయి.



## లిటిల్ హార్ట్స్‌పై మహేష్ బాబు పోస్ట్ వైరల్..

చిన్న బడ్జెట్‌తో రూపొందిన లిటిల్ హార్ట్స్ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని సాధించింది. రూ. 2.4 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం 10 రోజుల్లోనే రూ. 32 కోట్లకు పైగా వసూళ్లు సాధించి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తుండడంతో పాటు పలువురు సినీ ప్రముఖులు కూడా సినిమాపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ జాబితాలో తాజాగా సూపర్ స్టార్ మహేష్ బాబు కూడా చేరారు. ఆయన సినిమా చూసి సోషల్ మీడియాలో రివ్యూ షేర్ చేశారు. "లిటిల్ హార్ట్స్ సినిమా సరదాగా, కొత్తగా, చాలా బాగుంది. నటీనటులందరూ అద్భుతంగా నటించారు. చాలా జాయ్‌ఫుల్‌గా ఫీల్ అయ్యాను. సింజిత్.. నువ్వు ఫోన్ ఆఫ్ చేసి ఎక్కడికీ వెళ్లొద్దు బ్రదర్. ఇక నుంచి బిజీబిజీగా ఉండాల్సి వస్తుంది. రాకింగ్ చేస్తూ ఉండు. మొత్తం టీంకి నా అభినందనలు" అంటూ మహేష్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

-అక్షరటుడే, సినిమా డెస్క్

